
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
ఆదివారం 17 నవంబరు 2024



మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



క్రీడా ప్రాంగణాలు వేస్ట్

- కేంద్ర పథకాలపై అవగాహన కల్పించండి
- పది శీతల గిడ్డంగులకు ప్రతిపాదనలు పంపండి
- విశ్వకర్మ పథకం అమలు తీరు బాగాలేదు
- ఆఫీసర్లు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి
- హరితహారం బోగస్.. రికార్డులకే పరిమితం
- దిశ కమిటీ చైర్మన్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- సమావేశానికి ఎమ్మెల్యే వీర్లపల్లి ఒక్కరే హాజరు

రంగారెడ్డి అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : లక్షలు ఖర్చుపెట్టి జిల్లాలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలు వృథాగా మారాయని దిశ కమిటీ చైర్మన్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్షించారు. కేంద్రం నిధులతో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంగణాలను రద్దు చేయడమా.. లేదా అందుబాటులోకి తీసుకురావడమా.. ఏదో ఒకటి చేద్దామన్నారు. జిల్లాలో ఉపాధిహామీ పథకం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. హరితహారం ద్వారా వందశాతం మొక్కలు నాటినట్లు అధికారులు చెప్పడంతో.. దిశ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అది 90 శాతం బోగస్ అని, హరితహారం రికార్డులకే పరిమితమని విమర్శించారు. హరితహారం మొక్కలను పరిశీలించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కువగా సాగయ్యే కూరగాయ పంటలను ఉపాధిహామీ పథకానికి అనుసంధానించాలని ఉద్యానశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. పంటల సాగుపై, భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారిని ఎంపీ ఆదేశించారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి సూచించారు. పంటలను నిలువ చేసేందుకు జిల్లాలో 10 శీతల గిడ్డంగుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. పట్టుగొడుగుల పెంపకాన్ని, పాడి రైతులను ప్రోత్సహించాలని జిల్లా పశువైద్యాధికారికి సూచించారు. పశువులకు సరైన వైద్యం అందటం లేదని, ఆసుపత్రిలో కనీసం అటెండర్ కూడ ఉండటం లేదని ఆరోపించారు. గోపాల మిత్ర పశువులకు వ్యాక్సినేషన్ వేసేందుకు రూ.250 తీసుకుంటున్నారని సభ్యులు దిశ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు.

జిల్లాలో రోగులకు మెరుగైన వైద్యం అందటం లేదని, బస్తీ దవఖానాలో మెడిసిన్ లేదన్నారు. ఆయుష్మాన్ భారత్ ఎక్కడా అమలుకావడం లేదని ఆరోపించారు. జిల్లాలో డయాలసిస్ రోగుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మహేశ్వరం ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ నిరుపయోగంగా ఉందని సభ్యులు తెలిపారు. ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ చేసుకుంటున్న వారి జాబితా తనకు అందించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందివ్వాలని, రక్తహీనతను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమాధికారిని ఆదేశించారు. జాబ్‌మేళాను నిర్వహించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఉపాధి కల్పన అధికారిని ఆదేశించారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని పరిశ్రమల శాఖ అధికారికి సూచించారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో సదరన్ క్యాంపు ప్రతినెలా నిర్వహించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి కోరారు. కేంద్రం అందిస్తున్న పథకాలు చాలామందికి

మిగతా 8వ పేజీలో...

గ్రూప్-3 పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి రెండు రోజుల పాటు ఎగ్జామ్స్
- హాజరు కానున్న 56,394 మంది అభ్యర్థులు
- నిమిషం ఆలస్యమైనా పరీక్షకు నో ఎంట్రీ



మొయినాబాద్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రంగారెడ్డి అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) :తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జరిగే గ్రూప్-3 పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. సీసీ కెమెరాల నిఘా నీడలో ఈ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలకు జిల్లాలో 56,394 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. 17వ తేది (ఆదివారం) రెండు పేపర్లు ఉంటాయి. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు మొదటి పేపర్ ఉంటుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో పేపర్ పరీక్ష జరగనుంది. అలాగే ఈనెల 18వ తేది (సోమవారం) ఉదయం 3 పేపర్ ఉంటుంది. అభ్యర్థులను పరీక్షకు ఉదయం 8.30 గంటల నుండి 9.30 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లో అనుమతిస్తారు. 9.30 గంటల తర్వాత గేట్లు మూసి వేయనున్నారు. ఆలస్యంగా వస్తే అభ్యర్థులను అనుమతించరు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



నవాబ్‌పేట మండలంలో ప్రవహిస్తున్న మూసీ నది(ఫైల్)

నగరానికే తలమానికం

Sunday Special

నాటి ముచుకుందానే.. నేటి మూసీ నది

హైదరాబాద్ చరిత్రలో మూసీ నదికి ప్రత్యేక స్థానం ఉంది. ఒకప్పుడు నగరం పేరు చెప్పగానే మంత్రముగ్ధులను చేసే మూసీ నది కళ్ల ముందు కదలాడేది. కానీ ప్రస్తుతం మూసీ అంటే.. మురికి కూపం అంటూ చాలా మంది ముక్కు మూసుకుంటారు. అయితే ఈ నదికి ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. అనంతగిరి కొండల్లో జన్మించిన ముచుకుందా నదియే మూసీ నది. హైదరాబాద్ నగరానికి తలమానికంగా మారిన మూసీ నది కాలక్రమేణ తన ప్రాశస్త్యాన్ని కోల్పోయింది.

- అనంతగిరిలో జన్మించి.. వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలిసి..
- గతంలో నగరవాసుల దాహార్తి తీర్చిన మూసీ
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వరకే నదీ స్వచ్ఛత
- రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో 240 కి.మీ. మేర ప్రవాహం
- పూర్వవైభవం దిశగా ప్రభుత్వం కార్యాచరణ



అనంతగిరికొండల్లో మూసీ నది ప్రారంభం ఇక్కడి నుంచే..

వికారాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మూసీ నది 125 ఏళ్ల కిందట అన్ని నదుల మాదిరిగానే స్వచ్ఛతతో ఉండేది. ఘన చరిత్ర ఉన్న మూసీ కాలక్రమేణ కాలుష్యసాగరంగా మారింది. కాలుష్యం, ఆక్రమణలతో సుందరమైన మూసీ ఘనత మసక బారింది. నది ప్రక్షాళనపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఘాటుగా స్పందించడంతో నది పరీవాహక ప్రాంతాన్ని పర్యాటకులను ఆకట్టుకునేలా సుందరంగా తీర్చిదిద్దేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. నది అభివృద్ధి కోసం మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. లండన్ నగరం మీదుగా ప్రవహించే థేమ్స్ నది మాదిరిగా ఈ మూసీ నదికి పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసిన విషయం తెలిసిందే.

ఒకప్పుడు నగర దాహార్తిని తీర్చేలా

ముచుకుందా నది కాలక్రమేణా మూసీ నది పేరుతో ప్రాచుర్యంలోకి వచ్చింది. అనంతగిరి కొండల్లో పుట్టిన ఈ నది బుగ్గ మీదుగా, ధన్నారం, కొత్తగడి, పెండ్లిమడుగు, మూలమడ, చించల్‌పేట, అత్తాపూర్, అక్నాపూర్,

మిగతా 7వ పేజీలో...

అసంపూర్తిగా 'ఇంటిగ్రేటెడ్ మార్కెట్'

- మూడేళ్ల నుంచి పూర్తికాని నిర్మాణం
- నిధుల లేమితో అర్ధంతరంగా పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు



8

'డ్రంకెన్ డ్రైవ్'ను తప్పించుకోబోయి..

- రాంగ్‌రూట్‌లో వెళ్లిన కారు డ్రైవర్
- బైక్‌ను కారు ఢీకొట్టడంతో
- బైకర్ అక్కడికక్కడే మృతి
- శంషాబాద్ పట్టణంలో ఘటన



8

రవాణా చట్టాలను అతిక్రమిస్తే చర్యలు

- మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే..
- మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన శిక్ష
- ప్రయాణికులను అధికంగా ఎక్కించొద్దు
- డ్రైవర్లకు ఏసీపీ రంగస్వామి అవగాహన



7



నిర్మాణ దశలో బ్రిడ్జి

వంతెన.. ఇక అంతేనా?

- మూడేళ్లయినా పూర్తికాని పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం
- చేసిన పనులకు చెల్లించని డబ్బులు
- నిర్మాణ దశలోనే పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు

కేశంపేట, నవంబరు 16: పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతోంది. నిర్మాణం మొదలుపెట్టి మూడేళ్లవుతున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు. బ్రిడ్జి నిర్మాణం పూర్తికాక కేశంపేట మండల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఇప్పలపల్లి, పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి కాకునూర్, లేమామిడి, నిర్దవెల్లి గ్రామాల ప్రజల సౌకర్యార్థం కాకునూర్- లేమామిడి గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించాలని గత బీఆర్‌ఎస్

మిగతా 8వ పేజీలో...

నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి

కాకునూర్ - లేమామిడి గ్రామాల మధ్య బ్రిడ్జి లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. వాగు పారితే అవతలి వైపు పొలాలకు కష్టమవుతుంది. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించాలి.



గంగాధర శ్రీనివాస చారి, కాకునూర్ గ్రామస్తుడు

జన హోరు.. జాతర జోరు

మంచాల మండల పరిధిలోని బుగ్గక్షేత్రంలో కార్తీక మాస ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. దీపపు కాంతుల్లో ఆలయం దేదీప్యమానంగా వెలుగొందుతోంది. శనివారం కూడా భక్తులు జాతరకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో కార్తీక స్నానాలు ఆచరించి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మంచాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి)



శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రథోత్సవం.. వైభవోపేతం

మైసిగండి మైసమ్మ దేవత వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు శనివారం అమ్మవారికి అర్చనలు, విశేష అలంకరణలతో పూజలు నిర్వహించారు. రాత్రి పుష్ప రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచిన రథాన్ని తాళ్లతో లాగి మొక్కులు తీర్చుకున్నారు.

కడ్తాల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి)



రథాన్ని లాగుతున్న భక్తులు

కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

ఇబ్రహీంపట్నం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాలపై ప్రభుత్వం ఆంక్షలను ఎత్తివేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. శనివారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన సీఐటీయూ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2019 డిసెంబర్ నుంచి పాలకులు ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు విధిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఈ ఆంక్షలను వెంటనే ఎత్తివేసి ఆర్టీసీ నిర్వహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్, కవిత, బ్రహ్మయ్య, ఎల్లేష్, ఈ.నర్సింహ, పి.కృష్ణ, బుగ్గరాములు, టీ.నర్సింహ, చందూనాయక్, కె.నర్సిరెడ్డి, వీరయ్య, శేఖర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆలూర్ గ్రామంలో సంచరిస్తున్న కుక్కల గుంపు

కుక్కలు బాభౌయ్

చేవెళ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు భయపెడుతున్నాయి. రోడ్లపై గుంపులుగా సంచరిస్తూ ప్రజల మీదకు ఎగబడుతున్నాయి. ద్విచక్ర వాహనదారుల వెంటపడి గాయపరుస్తున్నాయి. ఇక చిన్న పిల్లలను బయటకు పంపాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రాత్రి వేళ బయట తిరగాలంటేనే జనం జంకుతున్నారు. గొర్రెల మందలపై ఎక్కడ దాడి చేస్తాయోనని కాపారులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుక్కల బెడద లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మేడ్చల్ జిల్లాలో రెండు కొత్త సొసైటీలు

- ఎదులాబాద్, మూడుచింతలపల్లిల్లో ఏర్పాటుకు సన్నాహాలు
- మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి వెల్లడి

ఘట్‌కేసర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కొత్తగా రెండు వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం సొసైటీ కార్యాలయంలో మాజీ చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులతో చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎదులాబాద్, మూడు చింతలపల్లిల్లో సొసైటీలు ఏర్పాటవుతాయని అన్నారు. ఘట్‌కేసర్ సొసైటీ అభివృద్ధికి చైర్మన్ తీసుకుంటున్న చర్యలను అభినందించారు. ఘట్‌కేసర్ సొసైటీ ఆవరణలో రైస్‌మిల్ ఏర్పాటు చేయాలని కొందరు ప్రతిపాదించడంపై మలిపెద్ది స్పందిస్తూ నివాసాల మధ్య రైస్‌మిల్ ఏర్పాటు సాధ్యం కాదని, కాబట్టి కో-ఆపరేటివ్ బ్యాంక్ ఇతర వ్యాపారాలపై దృష్టిసారించాలన్నారు. సొసైటీ కార్యాలయానికి 5నుంచి 8ఎకరాల ప్రభుత్వ భూమిని ఇప్పించాలని నాయకులు మాజీ ఎమ్మెల్యేను కోరగా.. సొసైటీనే ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు భూమి కొంటే బాగుంటుందని సూచించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్లు గొంగళ్ల స్వామి, డి.భిక్షపతిగౌడ్, మాజీ ఎంపీపీ బి.శ్రీనివాస్‌గౌడ్, ఎండీ రాహుల్‌రాజ్, నాయకులు బి.ప్రభాకర్‌రెడ్డి, స్టీవెన్, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రెండో ఏఎన్‌ఎంల మహాసభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పి.పర్వతాలు

శంషాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ పట్టణంలోని ఎలైట్ హోటల్‌లో నేడు(ఆదివారం) నిర్వహించే తెలంగాణ రాష్ట్ర రెండో ఏఎన్‌ఎంల మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామిలు పిలుపునిచ్చారు. శనివారం వారు శంషాబాద్‌లో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో 7వేల మంది వరకు ఉన్న రెండో ఏఎన్‌ఎంలకు 18ఏళ్లుగా రెగ్యులరైజ్ కాలేదని, దీంతో వర్కర్లు శ్రమ దోపిడీకి గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సభకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సెకండ్ ఏఎన్‌ఎంల ప్రతినిధులు హాజరవుతారని, అలాగే ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.జంగయ్య, రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, నాయకులు రామాంజనేయులు హాజవుతారని తెలిపారు. ఈ సమావేశంలో ఏటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి దత్తా, జిల్లా కార్యదర్శులు కె.చంద్రయాదవ్, సత్యనారాయణ, రెండో ఏఎన్‌ఎంల రాష్ట్ర నాయకురాలు జె.పద్మ, సక్రు తదితరులు పాల్గొన్నారు.

రవాణా చట్టాలను అతిక్రమిస్తే చర్యలు

● ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఏసీపీ రంగస్వామి అవగాహన



డ్రైవర్లతో మాట్లాడుతున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్ రూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), నూతన మోటారు వెహికిల్ యాక్ట్‌లను అతిక్రమిస్తే కఠిన శిక్షలు తప్పవని షాద్‌నగర్ ఏసీపీ ఎస్సీహెచ్.రంగస్వామి హెచ్చరించారు. షాద్‌నగర్‌లోని బుగ్గరెడ్డి గార్డెన్‌లో శనివారం డ్రైవర్లకు చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. వారితో ఆయన మాట్లాడుతూ.. వాహనాల అన్ని సర్టిఫికెట్లను వాహనదారులు కచ్చితంగా తనలో ఉంచుకోవాలన్నారు. లైసెన్స్, బీమా లేకుండా, అలాగే మద్యం తాగి వాహనాలు నడిపితే డ్రైవర్‌తో పాటు వాహన యజమానికీ పదేళ్ల జైలు శిక్ష ఉంటుందన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుపడితే తల్లితండ్రులకు శిక్ష పడుతుందని చెప్పారు. వాహనాల్లో కెపాసీటికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ విజయ్‌కుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంవీఐ వాసు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

సహకార రంగం బలోపేతానికి ప్రభుత్వం చర్యలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి తదితరులు

ఆమనగల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సహకార రంగం బలోపేతం, రైతుల శ్రేయస్సుకు రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆమనగల్లు ప్యాక్స్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఉపాధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సహకార రంగ సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులందరికీ సొసైటీల ద్వారా రుణాలిచ్చి సాగురంగం అభివృద్ధికి కృషి చేయాలని పాలకవర్గాలను కోరారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, ప్యాక్స్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, డీసీసీబీ అధికారులు, సొసైటీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై విశారదన్ పాదయాత్ర

వికారాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గడ్డపై బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికార సాధనకు, ప్రజా సమస్యల పరిష్కారానికి విశారదన్ మహరాజ్ రాష్ట్రంలో 15వేల కిలోమీటర్ల 'మా భూమి' పాదయాత్ర చేపడుతున్నారని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ రవీందర్ తెలిపారు. శనివారం వికారాబాద్‌లోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రవీందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ప్రతీ మనిషికి ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, భూమి కల్పించాలని పోరాటానికి డీఎస్పీ సిద్ధమవుతోందన్నారు. విశారదన్ పాదయాత్రకు ప్రజలంతా బ్రహ్మరథం పట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మల్లికార్జున్, పార్టీ మండలాల నాయకులు పాల్గొన్నారు.

రాయల్టీలుంటేనే ఖనిజాన్ని తరలించాలి

తాండూరు రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాయల్టీ ఉంటేనే నాపరాతి గనుల నుంచి బండరాళ్లను తరలించాలని తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ తెలిపారు. శనివారం గౌతాపూర్ చెక్‌పోస్టు వద్ద ఏడీ నాపరాతి లోడ్ లారీల పర్మిట్లను పరిశీలించారు. ఓగిపూర్, కరన్‌కోట్, మల్కాపూర్, సంగెంకలాన్, సిరిగిరిపేట్, కోట బాస్పల్లి గ్రామాల్లోని గనుల నుంచి నిత్యం నాపరాతిని తరలిస్తున్నారన్నారు. గనుల యజమానులు మైన్స్ శాఖ అనుమతుల మేరకే గనుల నుంచి ముడి సరుకులను తరలించాలన్నారు. కొందరు రాయల్టీ కట్టకుండానే లారీల్లో బండలను తరలిస్తున్నారని, అనుమతి లేని లారీలు పట్టుబడితే భారీ జరిమానా విధిస్తామన్నారు.

ఘనంగా హనుమంతుడి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పరిధి చౌడమ్మగుట్ట అంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ పూజారులు రఘుపతిరావు, రాఘవేంద్రచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం హనుమంతుడి ఉత్సవ విగ్రహంతో ఆలయం చుట్టూ పల్లకీసేవను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పుర ప్రముఖులు పి.శ్రీశైలంగౌడ్, జి.వసంతరావు, ఎల్.రఘుగౌడ్, రఘునందన్‌రెడ్డి, జి.రమేష్, జి.శ్రీనివాస్, కిషన్‌నాయక్, రాఘవేందర్, నారాయణ, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణయ్య, బచ్చన్న, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల లగేజీ మిస్!

శంషాబాద్ రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):శంషాబాద్ ఎయిర్‌పోర్టులో తమ లగేజీ మిస్సైందని 15మందిప్రయాణికులు శనివారం ఆందోళన చేశారు. నగరానికి చెందిన కొందరు అమెరికాలోని డల్లాస్ నుంచి ఖతర్ ఎయిర్‌లైన్స్‌లో దోహ వెళ్లారు. అక్కడి నుంచి ఇండిగో ఎయిర్ లైన్స్‌లో శంషాబాద్ చేరుకున్నారు. లగేజీని 11వ నంబరు బెల్టుపై వేయగా గంట వేచి ఉన్నా బ్యాగ్‌లు రాలేదు. ఎయిర్‌లైన్స్ సిబ్బందిని అడుగగా 9వ నంబరు బెల్టు వద్దకు వెళ్లాలన్నారు. అక్కడా బ్యాగులు కన్పించలేదు. దీంతో ప్రయాణికులు బ్యాగుల కోసం ఆందోళన చేశారు. డల్లాస్ నుంచి దోహ వెళ్లేందుకు 14గంటల 25నిమిషాలు పట్టగా, దోహ నుంచి హైదరాబాద్‌కు 4గంటల 20నిమిషాలు సమయం పట్టిందని, 19గంటలు ప్రయాణికులకు విమాన సిబ్బంది చుక్కలు చూపించారన్నారు. ఇప్పటికీ బ్యాగ్‌లు లభించలేదని, 24గంటల్లో వెతికిస్తామంటూ నిర్లక్ష్యంగా చెబుతున్నారని ప్రయాణికులు వాపోయారు.

గొల్ల చెరువుకు మహర్దశ ఎప్పుడో?



తాండూరులోని గొల్ల చెరువు

మినీ ట్యాంక్‌బండ్‌గా రూపుదిద్దుకునేదెన్నడు?

- సుందరీకరణ పనుల కోసం ప్రజల ఎదురుచూపు
- పూర్తి చేయాలని సర్కారుకు వేడుకోలు

తాండూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తాండూరు సమీపంలోని చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌లుగా అభివృద్ధి గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోనే మొదటి ప్రాజెక్టుగా తాండూరు గొల్లచెరువును ఎంపిక చేశారు. అయితే ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదు. గొల్ల చెరువు కంటే చిన్న చెరువులు అభివృద్ధి చేశారు గానీ పట్టణానికి చేరువలో ఉన్న ఈ చెరుకు మాత్రం మహర్దశ పట్టడంలేదు. 2016లో గొల్ల చెరువు అభివృద్ధికి చర్యలు మొదలుపెట్టి అర్ధంతరంగా వదిలేశారు. ప్రతీ నియోజకవర్గానికి ఒక చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా ఏర్పాటు చేయాలని గత బీఆర్ఎస్ పభుత్వం నిర్ణయించినా తాండూరులో ఒక్క చెరువూ అభివృద్ధికి నోచుకోలేదు. గొల్ల చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా ఆధునికీకరిస్తామని బీఆర్ఎస్ పాలనలో మంత్రులు హరీ‌ష్‌రావు, మహేందర్‌రెడ్డి ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో రూ.3.5కోట్లు మంజూరు చేయగా ఆ నిధులతో బతుకమ్మ ఘాట్, తూము, కట్ట మరమ్మతులు చేసి వదిలేశారు.

పట్టణ నడిబొడ్డున 40 ఎకరాల విస్తీర్ణంలో..



పిల్ల తొవ్వను తలపిస్తున్న చెరువు కట్ట

వందేళ్ల చరిత్ర ఉండి తాండూరు నడిబొడ్డులో 40ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గొల్ల చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మారిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగంగా, పర్యాటక కేంద్రంగా, స్థానికులకు ఆహ్లాదాన్న పంచేది. అందుకు అనుగుణంగాను చెరువు నీటిని శుద్ధిచేయాలని సైతం గతప్రభుత్వం తలంచింది. బోటింగ్ ఏర్పాటుకు 14ఫీట్ల మేర నీరుండాలి. గొల్ల చెరువు నీటి లోతు 16ఫీట్ల వరకు ఉది. మున్సిపాలిటీ మన ఊరు-మన ప్రణాళిక కింద రూ.5కోట్లతో పనులకు ప్రతిపాదనలు పంపింది. నిధులేమీ రాలేదు. 40ఎకరాల్లో విస్తరించి ఉన్న గొల్ల చెరువు ఇప్పటికే 9ఎకరాల 30గుంటల్లో పేదులు ఇళ్లు నిర్మించుకున్నారు. పేదలకు వేరేచోట ఆవాసాలు కల్పించి చెరువు పరిరక్షణ మాస్టర్ ప్లాన్‌ను అధికారులు ప్రభుత్వానికి పంపారు. 5మీటర్ల వెడల్పు, 10మీటర్ల ఎత్తులో కట్ట ఏర్పాటు, తూము మరమ్మతు తదితరాలపై ప్రణాళిక రూపొందించారు. చెరువులో చేరుతున్న మురుగుతో దుర్వాస వస్తోందని, మురుగు నీటిని వేరే మార్గానికి మళ్లించడమో లేదా నీరే రాకుండా చేయాలన్న దానిపై చర్చించారు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ చెరువును పర్యాటంగా అభివృద్ధి ప్రజలు, ఉద్యోగులు, వృద్ధులు, వాకింగ్ చేసేవారికి ఉపయోగకరంగా ఉంటుందని అందరూ సంతోషించారు. మిషన్ కాకతీయ కింద చెరువులో రూ.40లక్షలతో పూడిక తీశారు. అలుగు నిర్మించారు. కట్టపై బతుకమ్మ ఘాట్ నిర్మించారు. సీసీ రోడ్డు, బ్యారికేడ్లు, చిన్న పార్కు, రీక్రియేషన్ క్లబ్, లైటింగ్, బతుకమ్మ మెట్లు, వినాయక నిమజ్జన ప్లాట్‌ఫామ్‌లను కట్టాలని నిర్ణయించారు. అయితే తలపెట్టిన పనుల్లో చాలామట్టుకు చేయక చెరువు సుందరీకరణ మరుగున పడింది.

నీటి శుద్ధికి రూ.6కోట్లు మంజూరు

బోటింగ్‌కు గొల్ల చెరువు అనుకూలంగా ఉంది. ఈ చెరువులో భారీగా నీటి నిల్వ ఉంటోంది. చెరువు నీటిశుద్ధి పనులకు మున్సిపల్ పాలకవర్గం రూ.5కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపింది. దీంతో మురుగు నీటిని దారిమళ్లింపు, ఇతర పనులకు రూ.6కోట్లు మంజూరు చేస్తూ ఇటీవల మంత్రులు కె.వెంకట్‌రెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు శంకుస్థాపన చేశారు. అయితే పనులింకా ప్రారంభమే కాలేదు. గతంలో ఆరుగురు చీఫ్ ఇంజినీర్లతో గొల్ల చెరువు నీటి శుద్ధికి కమిటీ వేయగా సదరు కమిటీ నివేదికిచ్చింది. సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభించి మినీ ట్యాంక్‌బండ్ కలను సాకారం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నగరానికే తలమానికం

(5వ పేజీ తరువాయి)

నారేగూడ, పులుమామిడి, గొల్లగూడ, గంగ్యాడ, గుబ్బడి ఫత్తేపూర్, ముబారక్‌పూర్, రావులపల్లి, శంకర్‌పల్లి, బుల్కాపూర్, టంగటూరు, రామంతాపూర్, చిన్న శంకర్‌పల్లి, పొద్దటూరు, పిల్లిగుండ్ల శివార్ల మీదుగా ప్రయాణిస్తూ ఉస్మాన్ సాగర్‌లో కలుస్తుంది. వికారాబాద్ జిల్లాలో మూసీ నది 26 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తుంది. ఈ నది ఒకప్పుడు హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీర్చేది. నగర ప్రజల తాగునీటి అవ సరాలు తీర్చేందుకు మూసీ నదిపై రెండు కృత్రిమ జలాశయాలు నిర్మించారు. మూసీ నది హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లోకి ప్రవహిస్తుంది.

చిత్తలూరు వద్ద దక్షిణ దిశగా మలుపు

నగరంలో మూసీ నదిపై ఏడు పురాతన వంతెనలు ఉన్నాయి. మూసీ నది దక్కన్ పీఠభూమిలో కృష్ణా నదికి ప్రధాన ఉప నదిగా ఉంది నగరం మధ్య నుంచి ప్రవహిస్తూ... చారిత్రక పాత నగరాన్ని కొత్త ప్రాంతం నుంచి వేరు చేస్తుంది. అనంతగిరి కొండల్లో 2,168 అడుగుల ఎత్తులో జన్మించిన మూసీ.. తూర్పు దిశగా ప్రవహించి హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల మీదుగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రవేశిస్తుంది. ఆలేరు, పాలేరు ఉప నదులను కలుపుకొని చిత్తలూరు వద్ద దక్షిణ దిశగా మలుపు తిరుగుతుంది. మూసీలో ఆలేరు ఉప నది కలిసే సూర్యాపేట చోట 1963లో జలాశయం నిర్మించారు. పాలేరు కలిసే చోట వాడపల్లి వద్ద 200 అడుగుల ఎత్తుకు దిగి ప్రయాణిస్తోంది. అనంతగిరి నుంచి వాడపల్లి వరకు 240 కిలోమీటర్ల దూరం మూసీ ప్రయాణం కొనసాగుతోంది. మూసీ బేసిన్ వైశాల్యం 4,329 చదరపు మైళ్ల కాగా, కృష్ణా నది బేసిన్ వైశాల్యంలో ఇది కేవలం 4.35 శాతమే. 1908లో కురిసిన భారీ వర్షాలతో మూసీ నదికి భారీ వరదలు వచ్చి 15 వేల మందికి పైగానే ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఆ తరువాతనే మూసీ నదికి వరదలు వచ్చినా ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేలా చర్యలు చేపట్టారు.



కమండల జలంతో అనంత పద్మనాభస్వామి పాదాలను అభిషేకించిన స్థలంలో వెలసిన భవానీ పుష్కరిణి

పురాణ ప్రాశస్త్యం ఇలా..

అనంతగిరి కొండల్లో అనంతపద్మనాభస్వామి కొలువుదీరిన చోటనే మూసీ నది జన్మించింది. ఈ నదికి పురాణ ప్రశస్త్యం కూడా ఉంది. పురాణాల ప్రకారం.. అనంతగిరి కొండల్లో మార్కండేయ మహర్షి తపస్సు చేస్తున్న సమయంలో ప్రతీ రోజూ తన యోగ సాధనతో అనంతగిరి నుంచి కాశీ వెళ్లి అక్కడ గంగా నదిలో స్నానమాచరించేవారు. రాజర్షి ముచుకుందుడు అనేక సంవత్సరాల పాటు రాక్షసులతో యుద్ధం చేసి అలసిపోయి అనంతగిరి అడవులకు వచ్చి శ్రీమన్నారాయణుడిని స్మరిస్తూ తపస్సు చేస్తారు. అయితే తనకు ఎవరు నిద్రాభంగం కలిగిస్తారో వారు అగ్నికి ఆహుతి అవుతారనే వరాన్ని దేవేంద్రుడు ముచుకుందుడికి ప్రసాదిస్తాడు. అనంతగిరిలో తపోనిష్టలో ఉన్న సమయంలో కాల యవనుడు అనే రాక్షసుడు అనంతగిరికి వచ్చి ముచుకుందుడికి తపోభంగం చేసి అగ్నికి ఆహుతవుతాడు. శ్రీమన్నారాయణుడు ముచుకుందుడికి దర్శనమివ్వగా, ఆయన తన కమండలంలోని జలంతో స్వామి వారి పాదాలను అభిషేకిస్తాడు. సంతోషించిన స్వామి అభిషేకించిన స్థలంలో జీవ నది ఉద్భవించి ముచుకుంద పేరుతో శాశ్వతంగా నిలిచిపోతుందని అనుగ్రహించినట్లు చరిత్ర చెబుతోంది. స్వామి వారి పాదాలను అభిషేకించిన స్థలంలోనే భవనాశిని పుష్కరిణి ఉంది. ఆ పుష్కరిణి నుంచి సన్నటి ధారగా ముచుకుందా నది ప్రయాణం ప్రారంభమై వికారాబాద్ పట్టణం మీదుగా రాజధాని వైపు ముందుకు సాగుతోంది.



గంగ్యాడ సమీపంలో మూసీ నది ప్రవాహం



గాంధీ విగ్రహంపై చెట్లకొమ్మల తొలగింపు

యాచారం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): యాచారంలో గురువారం కరెంటు వైర్లకింద చెట్ల నరికివేతలో భాగంగా గాంధీ విగ్రహం పక్కనున్న చెట్లనూ నరికారు. దాంతో చెట్లకొమ్మలు విగ్రహంపై పడ్డాయి. అయితే కొమ్మలు నరికిన వారు విగ్రహంపై నుంచి వాటిని తొలగించలేదు. ఈ నిర్లక్ష్యం శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'నాటడం.. నరకడం ఎందుకు?' శీర్షికన వచ్చిన వార్తకు మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు స్పందించారు. డాక్టర్ రవీందర్, సురేందర్, సంతోష్ తదితరులు గాంధీ విగ్రహంపైనుంచి కొమ్మలు తొలగించి విగ్రహాన్ని కడిగి పూలమాల వేశారు. జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఇలా కొమ్మలు నరికి విగ్రహంపై పడేయడం సరికాదన్నారు. ఈ విషయంపై వార్త ప్రచురించిన ఆంధ్రజ్యోతికి ఆర్యవైశ్య సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

హయత్‌నగర్ కోర్టులో వసతులు కల్పిస్తాం

● జిల్లా న్యాయాధికారి శశిధర్‌రెడ్డి

హయత్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ కోర్టులో మౌలిక వసతులు కల్పించేందుకు కృషిచేస్తానని రంగారెడ్డి జిల్లా న్యాయాధికారి శశిధర్‌రెడ్డి అన్నారు. కోర్టు ప్రాంగణంలో నిర్మించనున్న బార్ అసోసియేషన్ భవనానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డీజే మాట్లాడుతూ.. హయత్‌నగర్ కోర్టులో న్యాయవాదులకు అవసరమున్న వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బిక్షపతిగౌడ్ డీజేను సన్మానించి మాట్లాడుతూ హయత్‌నగర్ కోర్టుకు శాశ్వత భవనాన్ని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీ మెట్రోపాలిటన్ కోర్టు సూపరిండెంట్ శారద, నాజర్ లక్ష్మీనరసింహరెడ్డి, అడ్వకేట్ సొసైటీ కార్యదర్శి శ్రీధర్, గిరి, అనిల్‌కుమార్, బార్ కౌన్సిల్ సభ్యుడు మధుసూదన్ రావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ, సీఐలు నాగరాజుగౌడ్, అంజిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తప్పుల్లేకుండా సర్వే చేయాలి

శామీర్‌పేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):కుటుంబ వివరాల నమోదులో ఎన్యూమరేటర్లు తప్పుల్లేకుండా లేకుండా జాగ్రత్తలు పాటించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. శనివారం శామీర్‌పేటలో ఎన్యూమరేటర్లు చేస్తున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. నమోదు చేస్తున్న రికార్డులను చూశారు. కుటుంబాల వివరాల నమోదులో సరైన పార్మాట్‌లో తప్పులు దొర్లకుండా నమోదు చేసి పామ్స్‌ను భద్రపర్చాలని అధికారులను, ఎన్యూమరేటర్లను ఆదేశించారు.

వివక్ష పారదోలేందుకు క్రీడలు దోహదం

వికారాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వికారాబాద్ జిల్లాలోని దివ్యాంగులకు జిల్లా స్థాయిలో ఆటలపోటీలు నిర్వహిస్తామని జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి తెలిపారు. శనివారం ఆటల పోటీలను బ్లాక్ గ్రౌండ్‌లో ఆమె ప్రారంభించారు. దివ్యాంగులకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తూ వారిని ప్రోత్సహిస్తూ ఆత్మగౌరవాన్ని పెంచుతామన్నారు. సమాజంలో దివ్యాంగులపై వివక్షను పారదోలేందుకు ఆటల పోటీలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో బాలరక్ష భవన్ సమన్వయకర్త కాంతారావు, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రజిత, సీనియర్ అసిస్టెంట్లు జహీరుద్దీన్, రాములు, సంఘమేశ్వర్, ఎఫ్ఆర్‌వో వెంకటేశ్, ఫిజికల్ డైరెక్టర్లు ఆశాలత, సురేష్, శ్రీనివాస్, నరేష్, భవన్ సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న వెల్ఫేర్ అధికారి కృష్ణవేణి

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి



ఇబ్రహీంపట్నం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధి వివిధ గ్రామాల్లో కార్తీకమాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వీహెచ్‌పీ రాష్ట్ర అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ ఆధ్వర్యంలో దండుమైలారం శివాలయంలో శనివారం కార్తీకపౌర్ణమి ఉత్సవాలను నిర్వహించారు. డీసీపీ సునీతారెడ్డి ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏసీపీ కె.వీ.రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్సై నాగరాజు, ప్యాక్స్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లీశ్వరి జంగయ్య, వెంకట్‌రావు, ఐలేష్, అయ్యపురెడ్డి, డి.గణేష్, హరినారాయణ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర

శామీర్‌పేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే గిట్టుబాటు ధర వస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. శామీర్‌పేటలో కొనుగోలు కేంద్రాన్ని శనివారం విజయేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ సుగుణాబాయి తనిఖీ చేశారు. సన్న, దొడ్డు రకాల వడ్లు వేర్వేరుగా కాంట వేసి నిల్వ చేయాలన్నారు. సన్నొడ్ల గన్నీ బ్యాగ్‌లపై 'ఎస్' అనే అక్షరం, జిల్లా, సెంటర్, కోడ్ రాయాలని సూచించారు. అలాగే రెండు రకాల వడ్లను వేర్వేరు లారీల్లో మిల్లులకు తరలించాలని కేంద్రం ఇన్‌చార్జిని ఆదేశించారు. ఏ విషయంలోనూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



కొనుగోలు కేంద్రంలో తనిఖీ చేస్తున్న విజయేందర్‌రెడ్డి, సుగుణాబాయి

క్రీడాకారులకు ప్రోత్సాహం అభినందనీయం

శంషాబాద్ రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈషా ఫౌండేషన్ క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని సీఐ నరేందర్‌రెడ్డి అన్నారు. పెద్ద తూప్రలో శనివారం జరిగిన ఈషా ఫౌండేషన్ 16వ గ్రామోత్సవ వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి సీఐ నరేందర్‌రెడ్డి హాజరై విజేత జట్టుకు బహుమతి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. అలాగే క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, క్రీడలతో స్నేహబంధాలు ఏర్పాడుతాయని, మానసికోల్లాసం కలుగుతుందని చెప్పారు. క్రీడలను ప్రోత్సహించడంలో ఈషా ఫౌండేషన్ కృషి అభినందనీయమన్నారు. టోర్నీలో రంగాపూర్, మదన్‌పల్లి, రాచలూర్, తూప్ర, ఐనాపూర్, దయాలగూడ, అమీర్‌పేట్, పెద్దతూప్ర దేవుని పడకల్ టీంలు పాల్గొన్నాయి. ఫైనల్‌లోఐనాపూర్, మహదేవపురం తలపడగా ఐనాపూర్ విజేతగా, మహదేవపురం రన్నర్స్‌గా నిలిచాయి. విజేతకు రూ.9వేలు, షీల్డ్, రన్నర్స్‌కు రూ.5వేలు, షీల్డ్ అందజేశారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే గ్రామోత్సవ పోటీలు నిర్వహిస్తున్నామని, వచ్చే నెలలో హైదరాబాద్‌లో జాతీయ క్రీడలు నిర్వహిస్తామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. టోర్నీలో పాల్గొన్న వారందరికీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.



విజేత టీంకు బహుమతి అందజేస్తున్న సీఐ నరేందర్‌రెడ్డి



షీల్డు అందుకుంటున్న పోటీల్లో గెలిచిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టు

68వ ఎస్జీఎఫ్ ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు విజయం

తాండూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):ఈ నెల 15, 16 తేదీల్లో తాండూరులో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖోఖో పోటీల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టు విజయం సాధించింది. ఉమ్మడి పది జిల్లాల నుంచి 120మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. శనివారం ఫైనల్స్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టు ఆదిలాబాద్ టీంపై గెలిచింది. యాలాల ఎంఈవో సుధాకర్‌రెడ్డి, గౌతమి రెసిడెన్షియల్ కరస్పాండెంట్ మహిపాల్‌రెడ్డిలు విజేతలకు కప్పు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అనంతయ్య, గౌతమి స్కూల్ ప్రిన్సిపాల్ కొండారెడ్డి, జిల్లా పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.


కేసీఆర్‌తో ఉప్పల వెంకటేష్

కేసీఆర్‌ను కలిసిన ఉప్పల

తలకొండపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్‌ను శనివారం సాయంత్రం మిషన్ భగీరథ మాజీ వైస్‌చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కలిసి కేసీఆర్‌ను పూలమాల, శాలువలతో సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు, పార్టీపరంగా చేపడుతున్న కార్యక్రమాలను ఆయనకు వివరించినట్లు వెంకటేష్ తెలిపారు. ఈనెల 27న హైదరాబాద్‌లోని వీఎంఆర్ కన్వెన్షన్‌లో జరగనున్న తన చిన్నకుమారుడు డాక్టర్ ఉప్పల అనిల్ వివాహానికి రావాలని కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేసినట్లు ఉప్పల తెలిపారు.

రామ్మూర్తి నాయుడు మృతి తీరనిలోటు : యాదిలాల్

ఆమనగల్లు/యాచారం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతి తీరని లోటు అని టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి, కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అండేకార్ యాదిలాల్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నాయకుడు నక్క మహేందర్‌యాదవ్‌లు అన్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం రామ్మూర్తి నాయుడు చేసిన సేవలు చిరస్మరణీయమని వారు పేర్కొన్నారు. చంద్రగిరి ప్రాంత ప్రగతితో పాటు కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకునేవారని చెప్పారు. కార్యకర్తలను చేరదీసి సమస్యలు పరిష్కరించేవారని గుర్తుచేశారు.

అసంపూర్తిగా 'ఇంటిగ్రేటెడ్ మార్కెట్'

మూడేళ్ల నుంచి పూర్తికాని నిర్మాణం
నిధుల లేమితో అర్ధంతరంగా పనులు ఆపేసిన కాంట్రాక్టర్
పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు


నిలిచిపోయిన సమీకృత మార్కెట్ యార్డు పనులు

శంకర్‌పల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సమీకృత మార్కెట్ యార్డు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. రెండేళ్లలో పూర్తి కావల్సిన పనులు మూడేళ్లయినా ముందుకు సాగడం లేదు. కూరగాయలు, పండ్లు, మాసం ఇలా.. అన్నీ ఒకేచోట విక్రయాలు సాగేలా అప్పటి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా శంకర్‌పల్లి మున్సిపల్‌లో సమీకృత(ఇంటిగ్రేటెడ్) మార్కెట్ యార్డు పనులను ప్రారంభించింది. ప్రస్తుతం నిధులు లేక మార్కెట్ యార్డు నిర్మాణ పనులు ప్రారంభ దశలోనే నిలిచిపోయాయి.

ఒకేచోట క్రయవిక్రయాలు జరిగేలా

మున్సిపాలిటీల్లో ఒకేచోట క్రయవిక్రయాలు కొనసాగేలా బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ యార్డుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే శంకర్‌పల్లి మున్సిపల్‌లో 30గుంటల భూమి కేటాయించి, రూ.2కోట్ల నిధులతో 2021 జూన్‌లో అప్పటి మంత్రి సబితారెడ్డి సమీకృత మార్కెట్ యార్డుకు శంకుస్థాపన చేశారు. కాగా, మొదట్లో సాగిన చకచకా పనులు సాగినా.. ఆపై వేగం మందగించింది.

మొదటినుంచీ అడ్డంకులే..

సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణానికి మొదటి నుంచీ అడ్డంకులు ఎదురవుతున్నాయి. మున్సిపల్ కేంద్రంలో ప్రభుత్వానికి చెందిన ఎకరా స్థలం కూడా లేకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు సమీకృత మార్కెట్ నిర్మాణంలో తర్జనభర్జన పడ్డారు. అప్పటి మంత్రి సబితారెడ్డి రోడ్డు భవనాల శాఖ అధికారులతో మాట్లాడి ఒప్పించి శంకర్‌పల్లి మున్సిపల్‌లోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో 30గుంటల భూమి కేటాయించారు. అయితే, ఆ స్థలాన్ని రోడ్డు భవనాల శాఖ అధికారులు మున్సిపాలిటీకి అయిష్టంగానే అప్పగించారని సమాచారం.

నిధులు మంజూరు చేయాలి



బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో మార్కెట్ యార్డు కోసం నిధులు మంజూరు చేసింది. నిధుల కొరతతో అర్ధాంతరంగా పనులను నిలిచివేశారు. ప్రస్తుతం నిలిచిన పనులు పూర్తయ్యేలా చూడాలి. సమీకృత మార్కెట్‌తో పట్టణ ప్రజలతో పాటు దుకాణదారులకు ఉపయోగకరంగా ఉంటుంది. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు సైతం తొలగిపోతాయి.

- ఎజాస్ బీఆర్ఎస్ నాయకుడు, శంకర్‌పల్లి

వెజ్, నాన్‌వెజ్ బ్లాకులుగా నిర్మాణం

మార్కెట్ యార్డును విభజించి ఒకటి వెజ్, మరొకటి నాన్‌వెజ్ బ్లాక్‌గా నిర్మాణం చేపట్టారు. రెండు బ్లాకుల్లో కలిపి సుమారు 80-100 దుకాణాల నిర్మాణం ఉండేటట్లు డిజైన్ చేశారు. 2021లో జూన్‌లో శంకుస్థాపన చేసినా వెజ్ బ్లాకులో ఒక అంతస్తు నిర్మాణం చేపట్టగా మరొక అంతస్తు నిర్మాణం పనులు పూర్తి చేయలేదు. కాగా, నాన్‌వెజ్ బ్లాక్ పిల్లర్ల దశలోనే మిగిలిపోయింది. వ్యాపారులు, కొనుగోలుదారులకు సదుపాయాలు కల్పించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డును అందుబాటులోకి తెచ్చే ఆలోచనకు ఆదిలోనే ఆటంకం ఎదురైనట్లయింది.


పిల్లర్ల దశలో ఉన్న నాన్‌వెజ్ బ్లాక్ పనులు

నిధుల కొరతతోనే..

నిధుల కొరతతోనే మార్కెట్ యార్డు నిర్మాణం పూర్తి కావడం లేదని సమాచారం. సమీకృత మార్కెట్ నిర్మాణానికి ప్రారంభంలో రూ.2కోట్ల నిధులు కేటాయించగా, మంజూరైన నిధులతో కాంట్రాక్టర్ అయినంత వరకూ నిర్మాణాన్ని పూర్తిచేశారు. ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడంతో మార్కెట్ యార్డు నిర్మాణ పనులు ఆదిలోనే శిథిలావస్థలోకి వెళ్లే పరిస్థితి దాపురించింది. రూ.కోటి నిధులు మంజూరైతే గానీ పనులు పూర్తయ్యేలా లేవు. ఇప్పటికైనా అధికారులు శ్రద్ధ వహించి నిర్మాణాన్ని పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై శంకర్‌పల్లి మున్సిపల్ ఏఈ సాయికిరణ్‌ను వివరణ కోరగా నిధుల కొరతతోనే కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారని, ప్రభుత్వం మంజూరు చేయగానే పనులు ప్రారంభించి పనులు పూర్తి చేయిస్తామని ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

'డ్రంకెన్ డ్రైవ్'ను తప్పించుకోబోయి రాంగ్‌రూట్‌లో వెళ్లి.. బైక్‌ను ఢీకొన్న కారు.. బైకర్ అక్కడికక్కడే మృతి

శంషాబాద్ రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌ను తప్పించుకోబోయిన కారు డ్రైవర్ రాంగ్ రూట్‌లో వెళ్లేందుకు యత్నించగా ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొనడంతో బైకర్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన శనివారం ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బాల్‌రాజ్ కథనం మేరకు.. శంషాబాద్ మండల పరిధిలోని రషీద్‌గూడకు చెందిన కావలి దర్శన్(51) పని నిమిత్తం బైక్‌పై ఆరాంఘర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని ప్యారడైజ్ హోటల్ వద్దకు చేరుకున్నాడు. ఈక్రమంలో డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌ను తప్పించుకోబోయిన కారు డ్రైవర్ రాంగ్ రూట్‌లో వెళ్లేందుకు యత్నించాడు. దాంతో ఎదురుగా వస్తున్న బైక్‌ను కారు ఢీకొంది. బైక్‌పై ఉన్న దర్శన్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

కేశంపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లేమామిడి గ్రామ శివారులో శనివారం రాత్రి ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. మండలంలోని పోమాల్‌పల్లికి చెందిన కేశంపేట మల్లేష్ బైక్‌పై తలకొండపల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా, లేమామిడికి చెందిన నందాచారి బైక్‌పై తలకొండపల్లి వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో గ్రామ సమీపంలో బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో మల్లేష్ తీవ్రంగా గాయపడగా, నందాచారికి గాయాలైనాయి. విషయం తెలుసుకున్న కేశంపేట సీఐ నరహరి క్షతగాత్రులను అంబులెన్స్‌లో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మల్లేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియాకు తరలించారు. నందాచారి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విచారణ చేపట్టినట్లు సీఐ చెప్పారు.

వంతెన.. ఇక అంతేనా?

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం నిర్ణయించింది. బ్రిడ్జి నిర్మాణానికి రూ.3కోట్ల 50లక్షలతో అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు నెల్లూరుకు చెందిన కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నాడు.

పిల్లర్ల దశలోనే...

పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు మూడేళ్ల క్రితం ప్రారంభించారు. ఫుటింగ్‌లు పూర్తి చేసి దానిపై సిమెంట్‌తో స్లాబ్ వేశారు. అలాగే అటు ఇటు దిమ్మెలతో పాటు 12 భారీ పిల్లర్ల నిర్మాణం చేశారు. పిల్లర్లను కొంతవరకు పూర్తిచేసి ఇనుప చువ్వలతో వదిలేశారు. చేసిన పనులకు నాటి ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించక పోవడంతో అర్ధంతరంగా నిర్మాణం ఆపేశాడు.

రాకపోకలకు ఇబ్బందులు

బ్రిడ్జి నిర్మాణం ఆగిపోవడంతో లేమామిడి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాకునూర్‌కు వెళ్లాలంటే 8కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఐదు కిలోమీటర్ల దూర భారం తగ్గుతుందని తెలిపారు. అంతేకాకుండా షాద్‌నగర్ నుంచి లేమామిడి, నిర్ధవెల్లి గ్రామాలకు వెళ్లాలనుకునేవారు కేశంపేటకు వెళ్లకుండా ఇప్పలపల్లి, పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి, కాకునూర్ మీదుగా లేమామిడి, నిర్ధవెల్లికి చేరుకోవచ్చు. దీనిద్వారం కొంత దూరభారం తగ్గుతుంది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వాగుపారితే ఇబ్బందే..



వర్షాకాలంలో పెద్ద వాగు పారితే లేమామిడి నుంచి కాకునూర్ వెళ్లాలంటే ఎనిమిది కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుంది. రైతులు కూడా ఇబ్బంది పడుతారు. ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి. వెంటనే బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తేవాలి.

- మాడగొని శ్రీశైలంగౌడ్, లేమామిడి మాజీ సర్పంచ్

సామాజిక వర్గాల ఆర్థికాభివృద్ధికే సర్వే


కడ్తాల్ : సర్వే ఫారాలు అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్/ మాడ్గుల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సామాజిక వర్గాల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కులగణన చేపట్టిందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో శనివారం సమగ్ర సర్వేను పరిశీలించారు. సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించి అపోహలను తొలగించారు. సర్వేలో అలసత్వానికి తావ్వికూడదని సూచించారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే మాడ్గుల మండలంలోని వివిధ గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. ఎన్యూమరేటర్లు ఓంకేశవరెడ్డి, యాదగిరెడ్డిలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలందిస్తాం

● సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే శంకర్


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి) రాజకీయ పార్టీలతో నిమిత్తం లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ఈమేరకు శనివారం క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. గతంలో బీఆర్ఎస్ నాయకులు సూచించిన వారికే సంక్షేమ పథకాలు అందజేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ టౌన్, చౌదరిగూడ, కేశంపేట, కొందుర్గు, ఫరూఖ్‌నగర్ మండలాలకు చెందిన 117మందికి రూ.35.38లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులు, అలాగే కల్యాణలక్ష్మి పథకం కింద 26మందికి రూ.26,3116లక్షల చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన విద్యనందిద్దాం

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ, వారు ఆర్థికాభివృద్ధి చెందాలన్న ఆలోచనతో నిర్మిస్తున్న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి దాతలు సహకారం అందిస్తుండడం అభినందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్‌లో దాతల సహకారంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం కోసం నందిగామ మండలం చేగూరుకు చెందిన మాజీ ఎంపీపీ మంచనపల్లి ప్రియాంక శివశంకర్‌గౌడ్‌లు రూ.5లక్షల చెక్కును ఎమ్మెల్యేకు అందించారు. శివశంకర్‌గౌడ్ దంపతులను ఎమ్మెల్యే శంకర్ అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగ నర్సింహయాదవ్, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, జమృద్‌ఖాన్, ముబారక్, కుమార్‌గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి తమ్మినేని పరామర్శ


బౌరమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వీరభద్రం, నాయకులు

యాచారం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మన్నగూడకు చెందిన సీపీఎం రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి రవీంద్ర తల్లి బౌరమ్మ శనివారం ఉదయం మృతిచెందారు. ఈమేరకు అంత్యక్రియల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్‌వెస్లీ, పి.జంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బి.మధుసూదన్‌రెడ్డి, మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సమయంలో చాలా ధైర్యంగా ఉండాలని తమ్మినేనితో పాటు జాన్‌వెస్లీలు ఈ సందర్భంగా రవీంద్రకు సూచించారు.

క్రీడా ప్రాంగణాలు వేస్ట్

(5వ పేజీ తరువాయి)

తెలియడం లేదని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీ ఆదేశించారు. విశ్వకర్మ పథకం ప్రచారం బ్రహ్మాండంగా ఉన్నప్పటికీ.. అమలు తీరు మాత్రం బాగాలేదన్నారు. పది శాతం కూడ లక్ష్యం చేరుకోకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. సీతారాంపూర్‌లో పరిశ్రమలకు గుడి భూములు ఎలా ఇస్తారని ఎంపీ ప్రశ్నించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్, హెచ్‌ఎండబ్ల్యుడీసీ ఈడీ వయంక, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా టార్గెట్ 50 వేల కోట్లా?

జిల్లా సమీక్షలో భాగంగా లీడ్ బ్యాంకు మేనేజర్ జిల్లాకు ఇచ్చిన లక్ష్యాన్ని రూ.50వేల కోట్లుగా చెప్పడంతో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వామ్మో ఇంత పెద్దమొత్తంలో టార్గెట్టా అని విస్మయం వ్యక్తం చేశారు. ఇచ్చిన లక్ష్యంలో 50 శాతం అమలైనా.. జిల్లాలో పేదోళ్లు అనేవారు ఉండరన్నారు.

ఎమ్మెల్యేలు డుమ్మా..!

దిశ సమావేశానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాత్రమే హాజరయ్యారు. మిగతా వారంతా డుమ్మా కొట్టారు. చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, మహేశ్వరం, కల్వకుర్తి ఎమ్మెల్యేలు దిశ సమావేశానికి గైర్హాజరు కావడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కాగా, మూడు నెలలకు ఒకసారి జరిగే ఈ సమావేశాలకు ఒకరిద్దరు మినహా ఎవరూ హాజరు కావడం లేదు.

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయండి


ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో నాయకులు

మాడ్గుల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడితండా అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌చ కాంగ్రెస్ మండలాధ్యక్షులు భట్టు కిషన్‌రెడ్డి, సూదిని శ్రీనివాస్‌రెడ్డి, గుడితండా మాజీ సర్పంచ్ సురేష్‌లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందచేశారు. తండాలో సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్ర భవనం, జీపీ భవనం, మురుగుకాల్వల నిర్మాణం పనులకు నిధులు కేటాయించాలని వినతిపత్రంలో కోరారు.

ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

కడ్తాల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా నాయకుడు, మండల ఇన్‌చార్జి బక్కి కుమార్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను బీజేపీ శ్రేణులు ఎప్పటికప్పుడు ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మండల బీజేపీ కార్యకర్తల సమావేశం శనివారం కడ్తాల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. మండలాధ్యక్షుడు మన్యనాయక్ అధ్యక్షత నిర్వహించిన సమావేశానికి బక్కి కుమార్, రాష్ట్ర నాయకుడు భగీరథ్, జిల్లా నాయకులు శంకర్‌నాయక్, రెడ్యానాయక్, సాయిలాల్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు, సంస్థాగత కార్యక్రమాల నిర్వహణ, స్థానిక సంస్థల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. బీజేపీ నాయకులు లక్ష్మణ్, రాములు, మహేశ్, శ్రీశైలం, వెంకటేశ్, రాందాస్‌నాయక్, కుమార్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు పశుగ్రాసం వితరణ

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధి చౌడమ్మగుట్ట అంజనేయస్వామి ఆలయ ఆవరణలోని శ్రీ కృష్ణ గోశాలకు దాతలు ముందుకు వచ్చి వరి గడ్డిని ఇస్తున్నారు. శనివారం షాద్‌నగర్‌కు చెందిన శ్రీ లక్ష్మీ స్టీల్ అండ్ సిమెంట్ యాజమాని శివకుమార్ 5ట్రాక్టర్ల వరిగడ్డిని ఇచ్చారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని రాయికల్‌కు చెందిన మధుసుధన్‌రెడ్డి ట్రాక్టర్ వరి గడ్డిని ఇచ్చారు. దాతలను ఆలయ అభివృద్ధి కమిటీ కన్వీనర్ శ్రీశైలంగౌడ్ అభినందించారు.


పశుగ్రాసాన్ని ఇస్తున్న మధుసుధన్‌రెడ్డి

స్థానిక ఎన్నికలే టార్గెట్‌గా పనిచేయండి


సమావేశంలో మాట్లాడుతున్న అందె బాబయ్య

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఫరూఖ్‌నగర్ మండలశాఖ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ అధ్యక్షతన శనివారం స్థానిక ఏబీ కాంప్లెక్‌లో ఫరూఖ్‌నగర్ మండల సభ్యత్వ నమోదుపై సమీక్షా సమావేశం జరిగింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిలు హాజరై మాట్లాడారు. పల్లె ప్రాంతాల్లో సైతం పార్టీ సభ్యత్వం సానుకూలంగా సాగిందని, కేంద్ర అభివృద్ధి, సంక్షేమంపై ప్రజలు చర్చిస్తున్నారని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ సంస్కరణలతో ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్న ప్రస్తుత తరుణంలో స్థానిక సంస్థల్లో సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా, జడ్పీటీసీలుగా పోటీచేసి గెలవడానికి కార్యకర్తలు సన్నద్ధం కావాలని కోరారు. వంశీకృష్ణ, వెంకనోళ్ల వెంకటేష్, లష్కర్‌నాయక్, వి.నర్సింహ, వినోద్‌నాయక్, పి.సురేష్, రఘుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల అభివృద్ధికి కృషి

చౌదరిగూడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పద్మశాలి సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని ఆ సంఘం రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడు మచ్చ సుధాకర్‌రావు తెలిపారు. శనివారం మైలార్‌దేవ్‌పల్లి పద్మశాలి భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జిల్లేడ్ చౌదరిగూడ మండలానికి చెందిన మచ్చ సుధాకర్‌రావును రెండోసారి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా పద్మశాలి సంఘం షాద్‌నగర్ అధ్యక్షులు జనార్ధన్ ఆధ్వర్యంలో సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పద్మశాలీలు ఐక్యంగా ఉండాలని, సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. రెండోసారి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకోవడం చాలా సంతోషమన్నారు. గత 20 ఏళ్లుగా సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడ వెంకటస్వామి, నారాయణ, శేఖర్, చంద్రశేఖర్, రమేష్, రాజేందర్, భిక్షపతి, రాజు లక్ష్మీనారాయణ, రవీందర్‌లు పాల్గొన్నారు.


పద్మశాలి సంఘం సభ్యులతో నూతన అధ్యక్షుడు మచ్చ సుధాకర్‌రావు

లగచర్ల గిరిజనులపై కుట్రపూరిత కేసులు


విలేఖరులతో మాట్లాడుతున్న దశరథ్ నాయక్

కడ్తాల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): లగచర్ల గిరిజనులపై రేవంత్ సర్కార్ అక్రమంగా, కుట్రపూరితంగా పెట్టిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, కడ్తాల మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ డిమాండ్ చేశారు. రిమాండ్‌కు తరలించిన గిరిజనులను వెంటనే విడుదల చేయకపోతే కల్వకుర్తి నియోజకవర్గం నుంచి రెండు వేల మంది గిరిజనులతో కొడంగల్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహిస్తామని హెచ్చరించారు. కడ్తాల మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనులపై రేవంత్‌రెడ్డి సర్కార్ కక్ష, కుట్ర పూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. లగచర్లలో ఫార్మాసిటీ పేరుతో భూములు లాక్కొని సీఎం అల్లుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు. అలాగే అధికార పార్టీ ఆగడాలను అడ్డుకునేందుకు ఎంతటి పోరాటాలకైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. నమ్మి ఓట్లేసినందుకు జైలు పాలు చేస్తారా అని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు హరిచంద్‌నాయక్, లోకేశ్‌నాయక్, చత్రునాయక్, కన్నానాయక్, పాండు, రమణ, శ్రీను, సోమ్లు, భీమన్, అంజినాయక్, తదితరులు పాల్గొన్నారు.

చలో లగచర్లను విజయవంతం చేయాలి


రాంబల్ నాయక్

షాద్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) లగచర్ల గిరిజన రైతులను పరామర్శించడానికి లంబాడి హక్కుల పోరాట సమితి ఈనెల 20న చలో లగచర్ల కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ మాట్లాడుతూ చలో లగచర్ల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భూసేకరణ, పోలీసుల దాడుల్లో గాయపడ్డవారిని పరామర్శించేందుకే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దుద్యాల మండల పరిధిలోని రోటిబండ తండా , పులిచెర్లకుంట తండా, మైసమ్మగడ్డ తండా, గడ్డమీది తండా, ఈదులకుంట తండాలో తమ బృందం సభ్యులు పర్యటించి బాధితులను పరామర్శిస్తారని చెప్పారు. లగచర్ల ఘటనపై బాధితులను పరామర్శించడానికి వెళ్లిన బీజేపీ ఎంపీ డీకే అరుణను అడ్డుకున్నా.. ఆ నేతలు స్పందించకపోవడం గమనార్హమన్నారు. తన నియోజకవర్గ పరిధిలో పర్యటించేందుకు వెళ్తున్న ఒక ఎంపీని పోలీసులు అడ్డగించారంటే అక్కడ ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు.

హనుమాన్ ఆలయానికి హుండీ బహూకరణ

ఆమనగల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణ సమీపంలోని మాడ్గుల రోడ్డులో గల అంతిరింతిరి కొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయానికి జంగారెడ్డిపల్లికి చెందిన మద్ది అనితా మల్లేశ్ దంపతులు హుండీని బహూకరించారు. శనివారం గ్రామ భజన బృందం సభ్యులు, నాయకులతో కలిసి ఆలయ నిర్వాహకులకు అందజేశారు. అనితా మల్లేశ్ దంపతులను నిర్వాహకులు సత్కరించి అభినందించారు. నాయకులు పబ్బు పరమేశ్‌గౌడ్, దుద్దు ఆంజనేయులు యాదవ్, రామచంద్రయ్య, రవి, కొండల్, మల్లేశ్, మహేశ్, శ్రీశైలం, రాజు, కృష్ణ, నర్సింహ, మహేశ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పథకానికి నిధులు పెంచండి

షాద్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) పెరిగిన ధరలకు అనుగణంగా మధ్యాహ్న భోజన పథకానికి నిధులను కూడా పెంచాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం రంగారెడ్డి జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం కింద ఒక్కో విద్యార్థికి రూ. 9.95 మాత్రమే చెల్లిస్తుంన్నందున నాణ్యమైన భోజనం అందించడం లేదని, విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతూ విద్యకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ విషయాన్ని గమనంలో పెట్టుకుని నిధులు పెంచాలని కోరారు. సమీర్, శివశంకర్, అస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్

షాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈవో లక్ష్మణ్ అన్నారు. శనివారం తిమ్మారెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి, దాతల సహకారంతో విద్యార్థులకు స్పోర్ట్స్‌డ్రెస్‌లను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మాజీ సర్పంచ్ శకుంతలపాండు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.